క్లుప్తంగా

ఘనంగా కలశ లఘు సంప్రోక్షణ



పూర్ణాహుతి సమర్పిస్తున్న వేదపండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం విమాన శిఖర కలశ లఘు సంప్రోక్షణ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేకువజామున సైకతలింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విజ్ఞాపనం, మహాగణపతిపూజ రక్షాబంధనం, లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతిలను సమర్పించారు. శాంతి కలశాభిషేకం, మంత్రపుష్పం, విమాన శిఖర కలశ లఘు సంప్రోక్షణలను వేదపండితుడు విజయ్‌భట్టార్ ఆచార్యత్వంలో రుత్వికులు శాస్త్రానుసారం జరిపారు. ఇటీవల ఆలయంలోని శివుని గర్భాలయంపై ఉన్న విమాన శిఖర కలశం కోతుల తాకిడి వలన దెబ్బ తినడంతో బంగారు పూత పూసిన కలశ ప్రతిష్ట చేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీధర్, ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, మాజీ చైర్మన్ బుశెట్టి రాజశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు అల్లాడుపల్లె దేవస్థానం మూసివేత

చాపాడు : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థానం ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9.56 గంటల నుంచి సంపూర్ణ చంద్రగ్రహణం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి ఆలయాన్ని మూసివేస్తామని, సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం 7 గంటల నుంచి స్వామివారి దర్శనం కల్పించడం జరుగుతుందని తెలిపారు.

సర్వేపల్లిని స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

ప్రొద్దుటూరు : అధ్యాపకులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదివి దేశానికి సేవ చేయాలని సూచించారు.

కమీషన్ల కోసమే మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం



మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకు వస్తే నేటి ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడి వాటిని ప్రైవేట్ పరం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం మాజీ సీఎం జగన్ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారన్నారు. 17 చోట్ల కాలేజీలు మంజూరు అయితే అందులో 5 చోట్ల క్లాసులు మొదలు అయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మరో 11 చోట్ల అడ్మిషన్లు జరిగి ఉండేవని అన్నారు. కానీ వారి నిర్లక్ష్యం కారణంగా చాలా మంది పేదలకు ఉచిత మెడికల్ సీటు లభించేచే అవకాశం ఉన్నా కూటమి ప్రభుత్వం పూర్తిగా వారి హక్కులను చంపేసిందన్నారు. 4 సార్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీనైనా మంజూరు చేయించారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు రాజీవ్ బాషా పాల్గొన్నారు.

వెల్లాల ఆలయానికి రూ.2 లక్షలు వితరణ



విరాళాన్ని అందిస్తున్న దాత బండి ఆంజనేయులు

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీ సంజీవరాయస్వామి ఆలయానికి శనివారం రూ.2లక్షలు విరాళం అందించినట్లు సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, ఉత్సవ కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి తెలిపారు. కడప నగరం సాయిపేటకు చెందిన బండి ఆంజనేయులు, దేవకీదేవి దంపతులు రూ.2,00,116 విరాళంగా ఇచ్చారని వారు పేర్కొన్నారు. అనంతరం దాతలకు ఆలయంలో పూజలు అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఆలయ ఆవరణలో పోట్లదుర్తికి చెందిన రాజబాబు దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసన

వాట్సాప్ గవర్నెన్స్‌పై ఇంటింటికి వెళ్లడాన్ని బహిష్కరిస్తున్నాం



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మైదుకూరు : ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల విధులపై శుక్రవారం విడుదల చేసిన ఆదేశాలు సచివాలయ ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని చులకన చేసే విధంగా ఉన్నాయని, వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఇంటింటికి వెళ్లడాన్ని తాము బహిష్కరిస్తున్నామని.. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపు మేరకు వారు ప్రభుత్వ ఆదేశాలను వ్యతిరేకిస్తూ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల బాధను పలు మార్లు అధికారులకు వినతి పత్రాల ద్వారా తెలియజేసినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. రోజు రోజుకు ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని మరింత దిగజారుస్తూ, పరిపాలనలో కీలకమైన సచివాలయ ఉద్యోగుల శక్తిని నిర్వీర్యం చేసేలా అధికార వర్గాలు ప్రవర్తిస్తున్నాయని ఆరోపించారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధులను సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లకు మ్యాప్ చేసి బలవంతంగా ఇంటింటికి తిరిగే విధులు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రతి ఇంటికి వెళ్లాలని అధికారులు ఇచ్చిన సాధ్యం కాని ఆదేశాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ విధులు బహిష్కరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆత్మ గౌరవ సమస్యతో కొట్టుమిట్టాడుతూ తమ బాధను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలనే ఉద్దేశంతోనే నిరసన తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాటాల ప్రతాప్, ఎల్‌సీ గంగిరెడ్డి, ఏవీ కృష్ణయ్య, బాలసుబ్బయ్య, ఎం.వీరమోహన్, పి.రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కలసపాడు : సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేశ్వర్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి వాలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, వాలంటీర్ ప్రతి 50 కుటుంబాలకు వారధిగా పనిచేసి సేవలందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ వ్యవస్థను తొలగించి ఎటువంటి ప్రతిఫలం లేకుండా సచివాలయ సిబ్బందికి అప్పగించడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ఎంపీడీఓ మహబూబ్‌బీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు వెంకటరాము, యశ్వంత్‌సాయి, రాజేష్, త్రివేణి, నరసింహ, కార్తీక్, సుజిత, మేఘన, నాయబ్‌రసూల్, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు శనివారం తమ సమస్యల పరిష్కారం కోసం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపు మేరకు వారంతా మన మిత్ర సేవలను బహిష్కరించి ఈ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల జిల్లా జేఏసీ కన్వీనర్ మస్తాన్ మాట్లాడుతూ వలంటీర్లు చేయాల్సిన పనులను, విధులను సచివాలయ ఉద్యోగులకు కేటాయించి వారితో ఊడిగం చేయించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా వారి ఆత్మ గౌరవాన్ని తగ్గించే చర్యలు చేపట్టడం సరైన నిర్ణయం కాదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ శాఖ రద్దు చేసి మాతృశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్ చేసే పనులను ఒక ఉద్యోగికి 150 ఇళ్లను కేటాయించి ఒత్తిడి పెంచడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు కానీ, నేషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా మానసిక వేదనకు గురిచేస్తున్నారన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలన్నకు వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్ నాగార్జున, జనరల్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కార్తీక్, ఓంకారం, రఫీ, గగనకుమార్‌రెడ్డి, హుస్సేన్ పీర్, విజయలక్ష్మి, సునీత, ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలన్నకు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

బొజ్జగణపయ్యా... ఇక సెలవయ్యా...



నిమజ్జనానికి తరలిన గణనాథుడు



కోలాటం ఆడుతున్న కళాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితి పర్వదిన సందర్భంగా పలు ప్రాంతాల్లో కొలువైన గణనాథుని విగ్రహాలను శనివారం పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. రామేశ్వరం, వసంతపేట, వైఎంఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ట్రాక్టర్‌లోకి ఎక్కించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున వినాయక కమిటీ వారు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినాయక ఉత్సవ కమిటీ వారు గణనాథుని విగ్రహాలను కోలాటం, బాణ సంచా పేలుళ్లు, డప్పువాయిద్యాల సందడి, నృత్యం చేస్తూ రంగులు చల్లుకుంటూ, జై బోలో గణేష్‌మహారాజ్ కీ జై అంటూ నినాదాలు చేస్తూ కోలాహలంగా పురవీధుల్లో ఊరేగించారు. కామనూరు, చాపాడు కుందూ నదిలో నిమజ్జనం చేశారు.

విద్యార్థులు లక్ష్య సాధన వైపు పయనించాలి

సైకాలజిస్ట్, మోటివేటివ్ స్పీకర్ సుధీర్ సనద్ర



మాట్లాడుతున్న ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సనద్ర

చాపాడు : చదువుకునే విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని లక్ష్యసాధన వైపు పయనించాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేటివ్ స్పీకర్ సుధీర్ సనద్ర పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలేజీలో శనివారం 2కె25 పేరుతో ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకుని చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సీబీఐటీ చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికి తీసి చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకుని లక్ష్యాన్ని ఎంచుకొని చదువులో ముందుకు సాగాలన్నారు. విద్యార్థి దశలో బాగా చదువుకుంటే తదుపరి దశలో ఉన్నతంగా ఉండాలని, తమ సలహాలు సూచనలను జూనియర్ విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీఐపీ డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శృతి, సీఈఓ మోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతే లక్ష్యం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : ఎలాంటి ఆదరణకు నోచుకోని వ్యర్థ పదార్థాలు సేకరించే కార్మికుల భద్రత, గౌరవాన్ని పెంపొందించడమే లక్ష్యంగా నమస్తే ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వంటి వాటిని ఏరుకుని జీవనం సాగిస్తున్న కార్మికులను గుర్తించి వారికి పీపీఈ కిట్లు, సామాజిక భద్రత, ఆరోగ్య ప్రయోజనాలు, నైపుణ్యాల మెరుగుదలకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. స్క్రాప్ షాపుల యజమానులు తమ దుకాణాలకు వచ్చే చెత్త ఏరుకునే వారి సమాచారాన్ని మున్సిపల్ కార్యాలయంలో అందించాలని కోరారు. అలాగే మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది కూడా అటువంటి కార్మికుల సమాచారాన్ని సేకరించి మున్సిపల్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నవజీవన్ ఆర్గనైజేషన్ స్టేట్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ మారుతిప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో మొట్టమొదటిసారిగా బద్వేలు మున్సిపాలిటీలో నమస్తే ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, స్వచ్ఛంద సేవా సంఘం ప్రతినిధులు సొద్దల పెంచలయ్య, ఓ.ఎస్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని అలవరచుకోవాలి



వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని టాటా బిల్డింగ్ ఇండియా సంస్థ ప్రతినిధి వరలక్ష్మి పేర్కొన్నారు. పెన్నానగర్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు 'స్వయం సమృద్ధ భారతదేశం కోసం మీరిచ్చే ఐదు సూచనలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో మహినూర్, ఫక్రుబాష, యాస్మిన్, సీనియర్ విభాగంలో అబీదా, ఫక్రూబీ, హఫీసాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

ట్రంప్ నిర్ణయం దుర్మార్గం



ఆందోళన చేస్తున్న సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు

బద్వేలు అర్బన్ : భారతీయ సరుకుల ఎగుమతులు, దిగుమతులపై సుంకాన్ని పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం దుర్మార్గమని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బైపాస్ రోడ్డులోని వైఎస్ సర్కిల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రంప్ నిర్ణయంతో మన దేశంలోని ఆక్వా, టెక్స్‌టైల్స్ ఉత్పత్తుల ధరలు విపరీతంగా పడిపోయి ఆయా రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల ఉపాధికి ముప్పు వాటిల్లే ప్రమాదముందని అన్నారు. ట్రంప్ సర్కార్ భారత ప్రయోజనాలను దెబ్బతీస్తున్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, ఏరియా కమిటీ సభ్యులు బాబు, విజయరావు, నారాయణ, రామరాజు, జయరామరాజు, మహబూబ్‌బాష పాల్గొన్నారు.

సేవాశ్రమంలో పునరుద్ధరణ పనులు

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామ సగిలేరు నది ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో పునరుద్ధరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సేవాశ్రమం స్థాపించి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఆశ్రమ నిర్వాహకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పనులను మొదలు పెట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సింగల్‌రెడ్డి రామకృష్ణారెడ్డి సహకారంతో ఆశ్రమం మొత్తం పెయింటింగ్, స్ఫూర్తిదాయకమైన వ్యాఖ్యలు, సందేశాత్మక చిత్రాలను వేయిస్తున్నామన్నారు. శాశ్వతంగా ఉండేలా వేదికను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తమ ఆశ్రమం ద్వారా సమాజానికి మంచి సందేశం వచ్చేలా మెరుగులు దిద్దుతున్నామని పేర్కొన్నారు. ఎటువంటి ఆదరణ లేని అభాగ్యులకు ఉచితంగా ఆశ్రయం కల్పిస్తామని, వారి ఆరోగ్య పరిస్థితులను బట్టి వసతులను ఏర్పాటు చేశామన్నారు. దాతల సహకారంతోనే ఈ పనులు మొదలు పెట్టామన్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు.

సేవకు పురస్కారం

ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు పురస్కారం అందజేశారు. 64 మందికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేశారు. గురుపూజోత్సవ వేడుకలను పురస్కరించుకుని కడపలోని కలెక్టరేట్ సభాభవన్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. – ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు



కలెక్టర్ ద్వారా ప్రశంసా పత్రం అందుకుంటున్న పోరుమామిళ్ల హెచ్ఎం జనార్దన్,



గాయత్రి, స్కూలు అసిస్టెంట్, ప్రొద్దుటూరు



గురవయ్య, స్కూలు అసిస్టెంట్, బి.మఠం



ఓబయ్య, స్కూలు అసిస్టెంట్, బద్వేలు



సుబ్బారెడ్డి, స్కూలు అసిస్టెంట్, కాశినాయన



సయ్యద్‌బాషా, స్కూలు అసిస్టెంట్, ప్రొద్దుటూరు



శివప్రసాద్, స్కూలు అసిస్టెంట్, బద్వేలు



సుచిత్రకుమారి, ఎస్‌జీటీ, ప్రొద్దుటూరు




కృష్ణయ్య, ఎస్‌జీటీ, చాపాడు



శ్రీనివాసులు, ఎస్‌జీటీ, బి.కోడూరు



రామకృష్ణారెడ్డి, ఎస్‌జీటీ, బి.కోడూరు



ఆదిశేషారెడ్డి, ఎస్‌జీటీ, పోరుమామిళ్ల



వెంకట సుబ్బన్న, ఎస్‌జీటీ, పోరుమామిళ్ల



వీరారెడ్డి, ఎస్‌జీటీ, కలసపాడు



గురవయ్య, ఎస్‌జీటీ, పోరుమామిళ్ల



రాధిక, ఎస్‌జీటీ, కాశినాయన



శ్రీనివాసులు, ఎస్‌జీటీ, పోరుమామిళ్ల



పెంచలయ్య, ఎస్‌జీటీ, ప్రొద్దుటూరు



గాయత్రి, ఎస్‌జీటీ, ప్రొద్దుటూరు



ఈశ్వర్‌రావు, ఎస్‌జీటీ, పోరుమామిళ్ల



శ్రీనివాసులు, ఎస్‌జీటీ, బి.మఠం



అబిదున్నీసాబేగం, ఎస్‌జీటీ ఉర్దూ, మైదుకూరు

అవార్డు గ్రహీతలకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సగిలిబాలయ్య, తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎం.శివప్రసాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన సందర్భంగా శనివారం హైస్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతులుగా తీర్చిదిద్ది వారి జీవితానికి సార్థకత తీసుకువచ్చే ఉపాధ్యాయ వృత్తి ఎంతో మహోన్నతమైనదని అన్నారు. నిబద్ధత, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు తప్పక గుర్తింపు లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి.రామచంద్రారెడ్డి, అనీషాబేగం, రామసుబ్బయ్య, భారతి, రామయ్య, జకరయ్య, కొండయ్య, నాగరాజారెడ్డి, సుబ్బారావు, వెంకటరమణ, సి.వి.రమణ, పరిమళజ్యోతి, శ్రీనివాసులు, బాలకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న మెర్సీమాలిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికై శుక్రవారం కడపలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. శనివారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలినిని ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై క్యాంపెయిన్

ప్రొద్దుటూరు క్రైం : హెచ్ఐవీ అవగాహనపై రాష్ట్ర స్థాయి క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ నరేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వైఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ విజయ భాస్కర్, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, కొండయ్య, ప్రభాకర్, చైతన్య సొసైటీ సిబ్బంది పుల్లయ్య, ఓలమ్మ, ఉమా మహేశ్వరి, వంశీ పాల్గొన్నారు.

అవకతవకలను అరికట్టాలి

ప్రొద్దుటూరు : జిల్లా వ్యాప్తంగా ఆర్సీఎం డయాసిస్ ఎయిడెడ్ స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవకతవకలను అరికట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీకుమార్, విశ్వనాథ్ తెలిపారు. శనివారం ప్రొద్దుటూరులోని తమ కార్యాలయంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆర్సీఎం డయాసిస్ ఎయిడెడ్ స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయన్నారు. ఉద్యోగం ఒక చోట సాధించి మరో చోట ఉద్యోగం చేస్తున్నారని, ఇదంతా విద్యాశాఖ అధికారుల సహకారంతోనే జరుగుతోందని ఆరోపించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్, సుబ్బమ్మ కోరారు. శనివారం వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రెగ్యులర్ చేసి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం అంగన్వాడీ వర్కర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా వినోదాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దస్తగిరమ్మ, ప్రధాన కార్యదర్శిగా మేరీ, ఉపాధ్యక్షురాలుగా ఓబుళాపురం విజయమ్మ, కోశాధికారిగా జ్యోతిమ్మతో పాటు 16 మందితో కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో అంగన్వాడీ ప్రాజెక్టు వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

జాతీయ సభను జయప్రదం చేయండి

మైదుకూరు : వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కడపలో నిర్వహిస్తున్న జాతీయ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శివకుమార్ కోరారు. శనివారం మైదుకూరులో జాతీయ సభ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ భూపంపిణీ, సాగు నీరు, ఉపాధి హామీ పథకం ఎజెండాగా ఈ జాతీయ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ సభలో విజయ రాఘవన్, బి.వెంకట్, డాక్టర్ సదాశివన్, లలితా బాలన్, విక్రమ్ సింగ్ తదితర వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో షరీఫ్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అతి వేగంతో ప్రమాదాలు

ప్రొద్దుటూరు క్రైం : వాహనాలను మితిమీరిన వేగంతో నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ సీఐ రాజగోపాల్ తెలిపారు. పట్టణంలోని ఆటో డ్రైవర్లకు శనివారం రాజగోపాల్ రాజీవ్ సర్కిల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోల్లో కచ్చితంగా సరైన పత్రాలను కలిగి ఉండాలన్నారు. ఓవర్ లోడ్‌తో ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించకుండా ఆటోలు నడపాలన్నారు. డ్రైవర్లు అందరూ కచ్చితంగా యూనిఫాం ధరించాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నియమాలతో కూడిన కరపత్రాలను కూడళ్లు, బస్టాండ్, పెట్రోల్ బంకుల్లో అతికించారు.

యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలి

అట్లూరు : మహిళలు పొదుపు చేసుకున్న సుమారు రూ.3 లక్షలు యానిమేటర్ బీబీచాంద్ స్వాహా చేసిందని టీడీపీ నాయకుడు మొగల్ చిన్న రహంతుల్లా తెలిపారు. శనివారం పోరుమామిళ్లలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని చిదానందనగర్‌లో చామంతి డ్వాక్రా గ్రూప్ సభ్యులు గత 20 ఏళ్లుగా పొదుపు చేసుకుంటూ రుణాలు తీసుకుని చెల్లిస్తున్నారన్నారు. అయితే సభ్యులు నిరక్షరాస్యులు కావడంతో ఆమె గుట్టు చప్పుడు నగదును స్వాహా చేసిందని తెలిపారు.